# ఈనెల 28న కలెక్టరేట్ వద్ద ఆదివాసీల ధర్నా

ఒంగోలు : గిరిజనులు, ఆదివాసీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 28వతేదీ కలెక్టరేట్ వద్ద ఆదివాసీ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడావతు విష్ణునాయక్ తెలిపారు. సోమవారం అందుకు సంబంధించిన ప్రచార పత్రాలను ఆయన విడుదల చేశారు.

ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు, ఆదివాసీలు, విద్యార్థులంతా ధర్నాలో పాల్గొని రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు యత్నించాలన్నారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు బాలాజీ నాయక్, ఇట్టా గురప్రసాద్, మాల్యాద్రి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

# యువతను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

మైదుకూరు : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతోందని విమర్శించారు. బ్రహ్మంగారిమఠంలోని పర్యాటక అతిథి గృహంలో అఖిల భారత యువజన సమాఖ్య మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. ఇంటికో ఉద్యోగమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారన్నారు. నిరుద్యోగ యువతతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెలికితీసి యువజన సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. విదేశీ పర్యటనల పేరుతో ప్రధాని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. దళితులు, మైనార్టీ, అణగారిన వర్గాలపై దాడులను భాజపా ప్రోత్సహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అమరావతి ఫ్రీజోన్, ఉక్కు పరిశ్రమ, నిరుద్యోగ భృతి అంశాలపై యువత పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ తరగతుల్లో ఏఐటీయూసీ జిల్లా మాజీ కార్యదర్శి బి.రామయ్య, మార్క్సిజం, మూల సూత్రాల అంశంపై వివరించారు.

యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరయ్య, ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శి మద్దిలేటి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ, ఏరియా కార్యదర్శి శ్రీరాములు, మండల కార్యదర్శి హృదయనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ మనందరి ధ్యేయం



ఐజీ మహమ్మద్ ఇక్బాల్

నంద్యాల : శాంతిభద్రతల పరిరక్షణ మనందరి ధ్యేయమని రాయలసీమ ఐజీ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. స్థానిక పురపాలక భవనంలో ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఉన్నారనే ధైర్యం ఓటర్లలో కల్పించి, వారు ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకునే వాతావరణం కల్పించాలన్నారు. ప్రజల్లో భద్రతా భావం కల్పించాలన్నారు. బాధ్యతతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. పోలీసు అధికారుల అనుమతి లేనిదే పోలీసులు పోలిం బూథలలోకి వెళ్లరాదన్నారు. 40 గ్రామాలు, 42 వార్డుల్లో ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకులు డేమిసన్, డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాయలసీమ డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆయన న్యూస్‌టుడేతో మాట్లాడుతూ ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు ప్రత్యేక పోలీసుల బలగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణం, నంద్యాల, గోస్పాడు మండలాల్లో బందోబస్తు నిర్వహించడానికి ముగ్గురు ఐపీఎస్ అధికారులను నియమించినట్లు చెప్పారు. అనుమానితులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు.

పట్టణంలో బందోబస్తు నిర్వహించేందుకు చిత్తూరు ఎస్పీ రాజశేఖరబాబు, నంద్యాల మండలంలో బందోబస్తు నిర్వహణకు విశాఖపట్నం గ్రామీణ ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, గోస్పాడు మండలంలో బందోబస్తు, ఒంగోలు ఎస్పీ ఏసుబాబును నియమించినట్లు చెప్పారు.

వీరుకాక 9 మంది అదనపు ఎస్పీలు 33 మంది డీఎస్పీలు 103 మంది సీఐలు, 242 మంది ఎస్సైలు, 394 మంది హెూకానిస్టేబుళ్లు, 1150 మంది కానిస్టేబుళ్లు, 270 మంది హోంగార్డులు, 288 మహిళా పోలీసులు, 234 మంది మహిళా హోంగార్డులు, 15 ప్లాటూన్ల ఏఆం పోలీసులు, ఎనిమిది ప్లాటూన్ల ప్రత్యేక పోలీసు బలగాలు, తొమ్మిది ప్లాటూన్ల ఏపీఎస్పీ పోలీసులు, ఆరు ప్లాటూన్ల కేంద్ర పోలీసులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# కాశీ మఠం పీఠాధిపతికి మినహాయింపు

## హైకోర్టు ఆదేశం

చిత్తూరు : తిరుమలలోని కాశీమఠం పీఠాధిపతి రాఘవేంద్రతీర్థ స్వామిజీకి నిధుల దుర్వినియోగం కేసులో కోర్టు నుంచి నోటీసులు జారీ అయ్యేంతవరకు కోర్టుకు గైర్హాజరయ్యేందుకు మినహాయింపు లభించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మఠానికి చెందిన నిధుల దుర్వినియోగంపై సీబీసీఐడీ పోలీసులు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో స్వామీజీని అరెస్టు చేసి స్థానిక ప్రత్యేక సీబీసీఐడీ కోర్టుకు హాజరుపరిచారు. అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. స్వామీజీ బెయిల్ రద్దు చేయాలని, కోర్టుకు హాజరుకావాలని సీబీసీఐడీ పోలీసులు కోర్టును అభ్యర్థించిన విషయం విధితమే. ఈ అభ్యర్థన పిటీషన్ విచారణలో ఉంది. తాను కోర్టుకు గైర్హాజరయ్యేందుకు మినహాయింపు ఇవ్వాలని స్వామీజీ హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టుకు గైర్హాజరుకు మినహాయింపు ఇవ్వడంతో పాటు ఈ కేసుకు సంబంధించిన చార్జీషీట్‌ను సీబీసీఐడీ పోలీసులు నాలుగు నెలల్లో కోర్టుకు అందచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# న్యాయానికి ఓటేయండి

గోస్పాడు : ప్రలోభాలకు, డబ్బుకు లొంగకుండా నంద్యాల ఓటర్లు నిజాయితీగా న్యాయానికి ఓటేయ్యాలని సినీనటి, నగరి ఎంఎల్ఏ రోజా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జిళ్లెల్ల, యాళ్లూరులో వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని రోడ్‌షో నిర్వహించారు. జిళ్లెల్లలో రోజా మాట్లాడుతూ శిల్పా మోహన్‌రెడ్డి అందుబాటులో ఉంటూ సమస్యలు తీరుస్తారన్నారు. రాయలసీమలో గుండ్రేవుల పూర్తయి ఉంటే ఎటువంటి కరవు ఉండేదికాదన్నారు.చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు ఉప ఎన్నికల్లో ఇచ్చే హామీలను ప్రజలు పట్టించుకోరన్నారు.

ఎవరికి భయపడకుండా ఓటెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో జిళ్లెల్ల చంద్రశేఖరరెడ్డి, నరసింహారెడ్డి, యాళ్లూరు రామసుబ్బారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల బాధ్యుడు అరవింద ప్రసాద్, మాజీ ఎంపీటీసీ నాగేశ్వరరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక



జమ్మలమడుగు : జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రాజసింహ, గౌరవాధ్యక్షుడు కె.వి.రమణారెడ్డి, కార్యదర్శి జి.ప్రసాద్ తెలిపారు. జమ్మలమడుగు, పుల్లంపేట, రాజంపేట, కోడూరు, పులివెందుల, ఎర్రగుంట్ల, మైలవరం, పెద్దపసుపుల, గొరిగనూరు ప్రాంతాల నుంచి 175 మంది బాలురు, 130 మంది బాలికలు హాజరైనట్టు చెప్పారు. సోమవారం జమ్మలమడుగు పీఆర్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన సాఫ్ట్‌బాల్ జట్లు సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎంపికైన బాలుర జట్టుకు రాజంపేట రీజెన్సీ, నలందా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 31 వరకు క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, ఇమామ్ సాహెబ్, అంకాల్‌రెడ్డి, వెంకటరమణ, ఎర్రన్న పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం మాటున లక్ష్యం మరుగు

ఒంగోలు : నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యంగా నగరపాలక సంస్థ స్థానిక తాలుకా పోలీసు స్టేషన్ నుంచి సుజాతనగర్, సోనియాగాంధీ మీదుగా సమతా నగర్ వరకూ ఆక్రమణలు తొలగించి రహదారిని విస్తరించారు. రహదారి విస్తరణతోపాటు సైడు కాలువలు నిర్మించారు. అందులో భాగంగానే సుజాతనగర్‌లోనూ కాలువలు నిర్మించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. స్థానికుల ఆక్రమణలతో నగరపాలక సంస్థ లక్ష్యం కాస్త నీరుగారుతోంది. ఇక్కడ దాదాపు ప్రతి ఇంటి వారు తమ ఇళ్లకు ఎదురుగా కాలువలపై మెట్లు, సిమెంట్ స్లాబ్‌లు నిర్మించారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పూడిక తీసేందుకు వీలు లేకుండా పోయింది. గత కొంత కాలంగా కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనికితోడు కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారు రోడ్డు పక్కనే నిర్మాణ సామగ్రిని తోలుతున్నారు. పోనీ.. అంతటితో ఆగారా అంటే.. అదీ లేదు. పాత భవనాల శిథిలాలను సైతం రోడ్డుకు మరోవ్కెపు కుప్పలుగా పోసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో మురుగుతో దుర్గంధం, భవన నిర్మాణ శిథిలాలతో రహదారి కుంచించుకుపోయి అవస్థలు షరామామూలుగా మిగిలాయని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిలిచి దోమల బెడద పెరిగి జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సుజాతనగర్‌పై దృష్టి సారించి మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డుపై రెండువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# లారీ ఢీకొని ఉపాధి కూలీ మృతి

సిద్దవటం : ఉపాధిహామీ పనులు చేసేందుకు ఉదయాన్నే బయల్దేరిన కూలీని మృత్యువు కాటేసింది. రహదారి పక్కన నడిచి వెళుతుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. వివరాల్లోకి వెళితే.. సిద్దవటం మండలం భాకరాపేట శివారులోని శివునిపల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన సుబ్బరాయుడు (37) కొన్నిరోజులుగా ఉపాధిహామీ పనికి వెళ్లేవారు. భాకరాపేటలోని పాఠశాల మైదానంలో గుంతలు తీసేందుకు ఇంటి నుంచి బయల్దేరారు. ప్రధానరహదారి పక్కన నడిచి వెళుతుండగా మార్గమధ్యలో పాలకేంద్రం వద్ద చెన్నై నుంచి కడపకు వెళుతున్న హర్యానా రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీ వేగంగా వచ్చి అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతిచెందారు. ముందు వెళుతున్న తోటి కూలీలు ఈ విషయం తెలుసుకుని హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. భర్త మృతితో భార్య సుభద్ర, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఏఎస్సై జయరామ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని దేవునికడపలో గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అరుణ్‌రెడ్డి పేర్కొన్నారు.

# న్యాయ సేవలపై అవగాహన అవసరం

ఒంగోలు : జాతీయ న్యాయసేవాధికార సంస్థ నిర్దేశించిన పథకాలను, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేసేలా న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు కృషి చేయాని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.రాజావెంకటాద్రి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో రిటైనర్ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, జువెనైల్ జస్టిస్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో రాజావెంకటాద్రి సమీక్ష జరిపారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు తొమ్మిదో తేదీ జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా అందరూ క ృషి చేయాలన్నారు. ఆ దిశగా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

పారా లీగల్ వలంటీర్లు తమ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించాలని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, ఉచిత న్యాయవాది నియామకం గురించి ప్రచారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.వసుంధర, ఎన్. దేవకుమారి, జి. గాంధీ, పి.వి. రాఘవరావు, ఆర్.కల్యాణ చక్రవర్తి, పారాలీగల్ వలంటీర్లు వి.ఎస్.ఎస్.శాస్త్రి, వ్కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సింధు, శ్రీకాంత్‌లు

# విజయం సాధించాలని పూజలు




అంతర్వేది : గ్లాస్గో (స్కాట్లాండ్)లో జరుగుతున్న ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీల్లో మన రాష్ట్రం నుంచి పాల్గొన్న సింధు, శ్రీకాంత్ విజయం సాధించి స్వర్ణ పతకాలతో తిరిగి రావాలని కోరుతూ భారత బ్యాడ్మింటన్ ఈవెంట్ కార్యదర్శి కె.సి.హెచ్.పున్నయ్య చౌదరి, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.రఘుకిరణ్, పలు జిల్లాల కోచ్‌లు, క్రీడాకారులు, అభిమానులు అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి వారి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదాశీర్వచనం పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం బయట క్రీడల ఔనత్యాన్ని చాటుతూ నినాదాలు చేశారు. అనంతరం పున్నయ్య చౌదరి మాట్లాడుతూ మన దేశం నుంచి సింధు, శ్రీకాంత్, సైనా, సాయి ప్రణీత్ తదితర 21 మంది ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటల్లో మన రాష్ట్రం నుంచి లతొలిసారిగా సింధు, శ్రీకాంత్ పాల్గొంటున్నారన్నారు. వీరిద్దరూ ఛాంపియన్లుగా నిలవాలని కోరుతూ పూజలు చేశామన్నారు.

కార్యక్రమంలో తెలంగాణా బ్యాడ్మిం టన్ అసోసియేషన్ సభ్యుడు ఉప్పలపాటి బాబురావు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సోమరాజు, అక్కిరాజు, వసంతరాణి, పలువురు పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

# పాత రుణాలు చెల్లించి కొత్తరుణాలు పొందండి

పగిడ్యాల: పొదుపు సంఘం మహిళలు తీసుకున్న రుణాలు చెల్లించి వెంటనే కొత్త రుణాలు పొందాలని ఏపీఎం అయ్యమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు సుమలశ్రీ అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందరేగా ఆయా గ్రామైఖ్య సంఘాల పనితీరు, మొండి బకాయిల వసూలు తదితర అంశాలపై చర్చించారు. పొదుపుసంఘాలు చేపట్టిన పలు కార్యక్రమాలను బాధ్యులైన సిబ్బంది పర్యవేక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

# సమస్యలతో సచివాలయం బాట

చిత్తూరు : జిల్లా సచివాలయం అర్జీదారులతో కిటకిటలాడింది. రెండు వారాల తర్వాత జిల్లా సచివాలయంలో మీకోసం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి జిల్లా నలుమూలల నుంచి జనం పెద్దఎత్తున తరలిరావడంతో జిల్లా సచివాలయం కిక్కిరిసి పోయింది. అర్జీదారులు భారీగా బారులు తీరారు. తమ సమస్యలు పరిష్కారించాలంటూ జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న, జిల్లా సంయుక్త పాలనాధికారి పీఎస్ గిరిష, జిల్లా సంయుక్త పాలనాధికారి-2 చంద్రమౌళిలకు వినతులు సమర్పించారు.

ప్రజల అర్జీలను పరిశీలించిన జిల్లా పాలనాధికారి సదరు సమస్యలపై అక్కడే ఉన్న జిల్లా అధికారులతో మట్లాడారు. సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. మీకోసం కార్యక్రమంలో వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ వారం వచ్చిన వినతులు ఈ వారాంతానికి విచారించి పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అర్జీదారుల తాకిడి తగ్గకపోవడంతో జిల్లా పాలనాధికారి, జేసీ, జేసీ-2లు నేరుగా అర్జీదారుల వద్దకే వచ్చి వినతులు స్వీకరించారు. వరుసలో నిల్చున్న వారివద్దకే వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని రజకుల ధర్నా

తాము నిర్మించుకున్న ఇళ్లను కొందరు అగ్రవర్ణాల వారు కూల్చివేశారంటూ పెనుమూరు మండలం పులికల్లు గ్రామపంచాయతీ మనియణంపల్లె గ్రామానికి చెందిన రజకులు జిల్లా సచివాలయం వద్ద ధర్నా చేశారు. 1997లో ప్రభుత్వం ఒక్కొక్కరికి 3 సెంట్ల చొప్పున ఇంటి పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ స్థలం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకోగా ఇంటిని గ్రామానికి చెందిన కొందరు కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదన్నారు. ఇళ్లను కూల్చిన వారిపై కేసులు నమోదు చేయాలని, తమకు రక్షణ కల్పించాలని విన్నవించారు.

# దివ్యాంగుల సదస్సు విజయవంతం

కడప : కడప నగరంలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి (ఏపీవీహెచ్‌పీయస్) సదస్సు విజయవంతమైంది. సమితి నాయకులు మాట్లాడుతూ దివ్యాం గులకు నివాసగృహం, ఇళ్ల స్థలాలు కల్పించి, బస్సు, రైలు పాసులు ఒకేసారి అయిదు సంవత్సరాలకు లేదా శాశ్వతంగా ఇవ్వాలని కోరారు. సదస్సుకు హజరైన జిల్లా తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇందుకు సాను కూలంగా స్పందించి, త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం వికలాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. త్వరలో హోండా కంపెనీకి చెందిన ద్విచక్ర వాహనాలు కూడా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పుష్పగిరి విద్యా సంస్థల ఛైర్మన్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వికలాంగ విద్యార్థులు ఎంతమంది ఉన్నా 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతుల ఛైర్మన్ శ్రీకోటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు వికలాం గుల కోసం బడ్జెట్‌ను రూ.50కోట్ల నుంచి రూ.73 కోట్లకు పెంచారన్నారు. కార్యక్రమంలో సింగారెడ్డి రామచంద్రారెడ్డి, చిన్నసుబ్బయ్యయాదవ్ పాల్గొన్నారు.

